LVPEI
So that all may see
L V Prasad Eye Institute

# దేశవ్యాప్తంగా గులాబిరంగు కంటి కండ్లకలక,

# ముఖ్యంగా ఫోలిక్యులర్ కండ్లకలక కేసుల పెరుగుదల

*అప్రమత్తంగా ఉండండి, తగిన జాగ్రత్తలు తీసుకోండి మరియు సకాలంలో చికిత్స పొందండి!*

జులై 28, 2023: ఫ్లూ కాలంగా పిలువబడే వర్షాకాలం తనతోపాటు వైరస్ మరియు బాక్టీరియా ఇన్ఫెక్షన్లను వెంటపెట్టుకుని వస్తుంది. ఈ కాలంలో పెరిగిన తేమ మరియు చెమ్మ బాక్టీరియా మరియు వైరసులు వృద్ధిచెందడానికి ఒక అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తుంది. ఈ ఇన్ఫెక్షన్లలో చాలావరకూ అంటుకునేవి కాబట్టి, అవి తేలికగా ఒకరినుంచి మరొకరికి సంక్రమిస్తాయి.

ఈ కాలంలో ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరంకూడా 'గులాబిరంగు కన్ను' అనికూడా అనబడే 'కండ్లకలక' కేసులలో మనం దేశవ్యాప్తంగా పెరుగుదలను చూస్తున్నాము. కంటి తెల్లభాగాన్ని మరియు కనురెప్పల లోపలివైపును కప్పి ఉంచే పల్చటి శ్లేష్మపొర అయిన కన్జంక్టివా ఇన్ఫ్లమేషనును కండ్లకలక అంటారు. ఇది వైరల్, బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు,పారాసైట్ల పీడనం, అలర్జీలు, లేదా కొన్ని రసాయనాలకు గురికావడంవంటి అనేక కారకాలవలన జరుగుతుంది. అడెనోవైరస్ వంటి ఒక ప్రత్యేక వైరసుల సమూహం కారణంగా వచ్చే 'ఫోలిక్యులర్ కండ్లకలక' ఈ కాలంలో అత్యంత సాధారణంగా కనబడుతుంది.

తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, మరియు ఒడిషాలలో ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వ్యవస్థా కేంద్రాలన్నింటిలో 2023 జులై 1 వ తేదీనుంచి దాదాపు 1000 కండ్లకలక కేసులు నిర్ధారించబడ్డాయి మరియు చికిత్స పొందాయి.

"ఫోలిక్యులర్ కండ్లకలక అసౌకర్యంగా ఉంటుంది కానీ, ఇది సాధారణంగా దృష్టికి హాని కలిగించదు మరియు చాలా సందర్భాలలో శాశ్వత ప్రభావాలు లేకుండా పరిష్కరించబడుతుంది. అయినప్పటికీ, ప్రతిక్రియలను నివారించడానికి సమయానుకూల చికిత్స మరియు సరైన సంరక్షణ కీలకం. ఇది అన్ని వయసుల వ్యక్తులనూ ప్రభావితం చేయగలదు. కానీ, చిన్నపిల్లలు, వృద్ధులు మరియు బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారికి ఈ సమస్య మరింత హాని కలిగించవచ్చు," అన్నారు **డా మురళీధర్ రామప్ప**, కార్నియా కన్సల్టెంట్, ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ.

**డాక్టర్ సలహా**: మీకు కండ్లకలక లక్షణాలు ఏవైనా ఉన్నట్లు అనిపిస్తే, ఉపద్రవాలను నివారించడానికి వెంటనే వైద్య సంరక్షణ పొందండి. సరైన ముందుజాగ్రత్తలు తీసుకోండి. మీ కళ్ళను సంరక్షించడానికి మరియు మీ చుట్టుపక్కలవారికి సంక్రమించడాన్ని నివారించడానికి మంచి పరిశుభ్రతను పాటిస్తూ, సూచించిన చికిత్సకు శ్రద్ధగా కట్టుబడి ఉండండి. యాంటీబయాటిక్స్ మరియు స్టెరాయిడ్ల విచక్షణారహిత వినియోగాన్ని నివారించాలి మరియు అవసరమైనప్పుడు ఆరోగ్య సంరక్షణా నిపుణుల మార్గదర్శనలో మాత్రమే వాడాలి.

**ఫోలిక్యులర్ కండ్లకలకలో రకాలు**

- 'ఫారింగో-కంజన్క్టివల్-ఫీవర్ (పిసిఎఫ్)' అనబడే గొంతునొప్పితో కండ్లకలక: ఇది తరచుగా తేలికపాటిగా ఉంటుంది. ఇటీవల జలుబు లేదా శ్వాసకోశ ఇన్ఫెక్షన్ ఉన్న పిల్లలు మరియు యువకులలో ఇది సాధారణంగా కనిపిస్తుంది. ప్రస్తుతం మనం చూస్తున్న చాలా కేసులు పిసిఎఫ్ సంబంధితమైనవి.
- ఎపిడమిక్ కెరటోకన్జంక్టివైటిస్ అనబడే తీవ్రమైన కండ్లకలక: ఇది తక్కువగా ఉంటుంది మరియు తీవ్రంగా ఉండవచ్చు. ఇది కంటి ముందుభాగాన్ని (కార్నియా) ప్రభావితం చేస్తుంది మరియు దీర్ఘకాలిక దృష్టి సమస్యలను కలిగించవచ్చు.

**దీని వ్యాప్తిని అరికట్టడానికి తీసుకోగల ముందుజాగ్రత్తలు:**

- కండ్లకలక అంటువ్యాధి, కాబట్టి సోకిన వ్యక్తి ఇతర కుటుంబ సభ్యులు మరియు సంఘంనుండి దూరంగా ఉండాలి.
- దీని వ్యాప్తిని నివారించడానికి అదనపు జాగ్రత్తలు - తరచుగా చేతులు కడుగుకోవడం, కళ్ళను ముట్టుకోకండా ఉండటం మరియు వ్యక్తిగత వస్తువులను పంచుకోకపోవడం.

**లక్షణాలు:**

- ఎరుపుదనం
- దురద
- కంటినుంచి అధిక స్రావం
- కాంతిపట్ల సున్నితత్వం
- కొన్ని కేసులలో, ఇది జ్వరం మరియు తేలికపాటి గొంతు నొప్పికి కారణమవవచ్చు.

**చికిత్స:**

- సమస్య రకం మరియు కారణంపై ఆధారపడి చికిత్స ఎంపికలు మారుతూ ఉంటాయి. వీటిలో సహాయక చికిత్స, గోరువెచ్చటి కాపడాలు, మెత్తబరిచే కంటి మందుచుక్కలు, మరియు అసౌకర్యం లేదా ఇన్ఫ్లమేషనునుంచి ఉపశమనానికి అనెల్జెసిక్స్ ఉండవచ్చు.

- అదనంగా, చికిత్స సమయంలో కాంటాక్ట్ లెన్సులు పెట్టుకోకపోవడం మరియు మెత్తని, చెమ్మగా ఉన్న తువ్వాలుతో కంటి స్రావాన్ని మృదువుగా శుభ్రంచేసుకోవడాన్ని సిఫార్సు చేయబడుతుంది.
- యాంటీబయాటిక్స్ మరియు స్టెరాయిడ్ల విచక్షణారహిత వినియోగాన్ని నివారించాలి మరియు అవసరమైనప్పుడు ఆరోగ్య సంరక్షణా నిపుణుల మార్గదర్శనలో మాత్రమే వాడాలి.